క్లుప్తంగా

బ్రహ్మాస్త్రం తయారీపై అవగాహన



బ్రహ్మాస్త్రం తయారీ చేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ఆధ్వర్యంలో భగీరథపురంలో రైతులకు సామూహికంగా బ్రహ్మాస్త్రం తయారీపై సిబ్బంది గురువారం శిక్షణ ఇచ్చారు. పురుగు మందులకు ప్రత్యామ్నాయంగా కషాయాలు వినియోగించాలని అవగాహన కల్పించారు. కషాయాల్లో కీలమైంది బ్రహ్మాస్త్రంగా చెప్పారు. సహజ చెట్ల ఆకులతో కషాయాల తయారీ జరుగుతుందని, పంటలకు ఎటువంటి నష్టం వాటిల్లదని వివరించారు. బ్రహ్మాస్త్రం కషాయం తయారీకి ఆముదం, సీతాఫలం, కాగు, వేప, బొప్పాయి ఆకులను ఆవుమూత్రంలో కలిపి వేడి చేసి తయారు చేసుకోవచ్చునని రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు సిబ్బంది వెంకట రమణ, ధనలక్ష్మి, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

శ్రీకూర్మంలో ఉచిత నేత్రవైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న దృశ్యం

గార: శ్రీకూర్మంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో త్రినేత్ర సూపర్ స్పెషాలటీ కంటి ఆస్పత్రి సౌజన్యంతో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ బొడ్డేపల్లి అనూష 125 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శలో కిరణ్‌కుమార్ తదితరులు

జి.సిగడాం: ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలి అప్పలసూరి చిన్నాన్న సూరప్పడు ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలియడంతో ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ నడిమివలస గ్రామానికి గురువారం వెళ్లి అప్పలసూరి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, మండల బూత్ కమిటీ కన్వీనర్ అబోతుల జగన్నాథం, స్థానిక సర్పంచ్ బాలి రమేష్, బాలి లక్ష్మణరావు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



తహసీల్దార్‌కు వినతపత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

జి.సిగడాం: ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్ మోహన్ కోరారు. గురువారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సంఘ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. 2004 సంవత్సరం నుంచి పని చేస్తున్న ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం ఆమలు చేయాలని, హక్కుల కోసం సభ్యులు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి మక్క గంగేశ్వరి, మండల శాఖ అధ్యక్షులు కాయల రమేష్, కిల్లారి వెంకటరమణ, మొయ్యి జనార్దనరావు, పిట్టా అప్పారావు పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావును కలిసి వినతి పత్రం అందజేశారు.

సెక్యూరిటీగార్డు ఉద్యోగాలకు ఎంపికలు



ఎంపికలు నిర్వహిస్తున్న అధికారులు

లావేరు: లావేరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సెక్యూరిటీ గార్డు ఉద్యోగాల కోసం ఎంపికలు జరిగాయి. ఎస్ఐఎస్ సెక్యూరిటీ సంస్థ కమాండెంట్ రాజీవ్‌కుమార్ షా, మండల పంచాయతీ అధికారి వి.విశ్వేశ్వరరావు, మండల పరిషత్ సూపరింటెండెంట్ సునీత అభ్యర్థుల ఎత్తు, ఆధార్ కార్డులు, విద్యార్హతలు పరిశీలించి ఎంపికలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన నిరుద్యోగ యువకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. నిరుద్యోగ యువత సెక్యూరిటీ సెక్టారులో కేరీర్‌ను మార్చుకోవడానికి ఇది మంచి అవకాశమని.. సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రతిపాదనల మేరకు ఉపాధి పనులు

- డ్వామా పీడీ చిట్టిరాజు

ఎచ్చెర్ల క్యాంపస్:

గ్రామ సభల్లో చేసిన ప్రతిపాదనల మేరకు ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులు ప్రారంభించాలని జిల్లా నీటి యాజమన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి.వి.చిట్టిరాజు అన్నారు. ఫరీదుపేటలోని నాతన్న చెరువులో జరుగుతున్న పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులు ప్రారంభించడానికి ఇదే అనువైన వాతావరణమన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వేతనదారులు రెండు పూటలా పనిచేయాలన్నారు. ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించడమే లక్ష్యంగా సిబ్బంది ముందుకు సాగాలన్నారు. రోజుకు గరిష్ట వేతనం రూ. 250 వచ్చేలా సాంకేతిక, క్షేత్రస్థాయి సిబ్బంది సూచనలు వేతనదారులు పాటించాలన్నారు. పూర్తిస్థాయి పనిదినాలు, గరిష్ట వేతనం వచ్చేలా చేయడమే లక్ష్యంగా సిబ్బంది కృషి చేయాలన్నారు. ప్రధాన మంత్రి సురక్ష బీమా పథకాన్ని జాబ్ కార్డు ఉన్న వేతనదారులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. రానున్నది వేసవి కాలం నేపథ్యంలో పనులు జరిగేచోట అన్ని సౌకర్యాలు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. పనులకు సంబంధించి గ్రామస్థాయిలో పక్కాగా రికార్డులు నిర్వహించాలన్నారు. ఈఎంఎంఎస్ యాప్‌లో వేతనదారుల హాజరు నమోదు చేయాలన్నారు. నిబంధనల మేరకే వేతదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తామన్నారు. పీడీ వెంట ఏపీవో శోభాదేవి, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.



ఈఎంఎంఎస్ యాప్ పరిశీలిస్తున్న పీడీ చిట్టిరాజు

వంద పని దినాలు కల్పించాలి

ఎచ్చెర్ల: ఉపాధి హామీ పథకం ద్వారా వేతనదారులకు వంద పని దినాలు కల్పించాలని డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు అన్నారు. కేశవరావుపేట గ్రామంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. కూలీలందరూ వ్యవసాయ పనులు ముగించుకుని ఖాళీగా ఉన్నందున వారు ఉపాధి పనులకు హాజరయ్యేలా చూడాలని సిబ్బందికి సూచించారు. రోజుకు రూ. 257 వేతనం గిట్టుబాటయ్యేలా పనికొలతలు ఇవ్వాలన్నారు. పనులకు వచ్చివెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని వేతనదారులకు సూచించారు. ఎస్ఏ ఆర్‌పీ భాస్కర్, సీజేఈ నారాయణమూర్తి, ఏపీవో శోభాదేవి ఉన్నారు.

ఇంజినీరింగ్ విద్యతో ఉజ్వల భవిత

ఎచ్చెర్ల క్యాంపస్: ఇంజినీరింగ్ విద్యతో ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని ఎచ్చెర్లలోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌సీవీ రమణ మూర్తినాయుడు అన్నారు. కళాశాల ప్రధాన ఆడిటోరియంలో గురువారం సమీప జూనియర్ కళాశాలల ఎంపీసీ ఇంటర్మీడియెట్ ద్వితీయ ఏడాది విద్యార్థులకు ఇంజినీరింగ్ విద్యపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపీసీ పూర్తిచేసిన విద్యార్థులు ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో చేరేందుకు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఇంజినీరింగ్‌లో పూర్తిస్థాయి ఫీజు స్ట్రక్చర్ జగనన్న విద్యా దీవెన కింద అందజేస్తోందని, జగనన్న వసతి దీవెన కింద మెస్ చార్జీలు ఇస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వం ఇంజినీరింగ్‌ను ప్రోత్సహిస్తోందన్నారు. ఇంజినీరింగ్ తరువాత క్యాంపస్ ఇంటర్వ్యూలు, ప్రభుత్వ నియామకాల్లో అనేక అవకాశాలు లభిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ సభ్యులు డాక్టర్ బుడుమూరు శ్రీరాంమూర్తి, బీఎస్ఆర్ మూర్తి పాల్గొన్నారు.

కార్మికులకు పూర్తి పనిదినాలు కల్పించాలి

రణస్థలం: బంటుపల్లి సమీపంలోని యునైటెడ్ బ్రేవరీస్ పరిశ్రమ కార్మికులందరికీ పూర్తిస్థాయి పనిదినాలు కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సి.హెచ్. అమ్మన్నాయుడు కోరారు. పూర్తిస్థాయి పనిదినాల కల్పనతోపాటు పలుసమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ విశాఖపట్నంలో కార్మికశాఖ సంయుక్త కమిషనర్ ఎం.రామారావును యునైటెడ్ బ్రేవరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశ్రమలో 600 మంది కార్మికులకు 2019 నవంబర్ నుంచి పూర్తి పనిదినాలు ఇవ్వకుండా నెలకు 13 నుంచి 16 పనిదినాలను మాత్రమే యాజమాన్యం కల్పిస్తోందన్నారు. దీంతో కార్మికుల కుటుంబాలు అవస్థలు పడుతున్నారన్నారు. పనిదినాలు తగ్గిపోవడంతో ఈఎస్ఐ వైద్యానికి అర్హత కోల్పోయారన్నారు. కార్మికులందరికీ 26 రోజులు పని కల్పించాలని లేనిపక్షంలో 50 శాతం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. యునైటెడ్ బ్రేవరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఇజ్జు నారాయణరావు, నాయకులు సత్యనారాయణ, వెంకటరమణ పాల్గొన్నారు.



రామారావుకు వినతి పత్రం అందజేస్తున్న కార్మిక సంఘు నాయకులు

పెద్దతల్లి ఆలయం వద్ద శివరాత్రి ఏర్పాట్లు

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళం గ్రామదేవతైన పెద్దతల్లి ఆలయం వద్ద మహాశివరాత్రి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు శివజ్యోతి భక్త భజన బృందం సభ్యులు తెలిపారు. ఆలయం వద్ద కార్యక్రమం బ్రోచర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 15 రోజులుగా భక్త బృందం అంతా భారీగా ఉత్సవాలు నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఈనెల 18న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఐదు అడుగుల శివలింగాన్ని రూపొందించామన్నారు. ఆ రోజున ఉదయం ఆరు నుంచి మరుసటి రోజు ఉదయం ఆరు గంటల వరకు జరగనున్న ఏకాహం భజన కార్యక్రమంలో 11 భజన బృందాలు పాల్గొంటాయన్నారు. అలాగే తొమ్మిది వేలమందికి ఆలయ అవరణలో అన్నప్రసాద వితరణ ఉంటుందని వివరించారు. అదే రోజు సాయంత్రం ఆరు నుంచి రాత్రి 12 గంటల వరకు తిరువీధి మహోత్సవం ఉంటుందన్నారు. తిరువీధిలో దక్షిణాది సన్నాయి మేళం, ఖాజీపేటకు చెందిన చిన్నారులచే కోలాటం, కొంగరాం చిన్నారులచే కర్రసాము, బళ్ల వేషాలు, బాణసంచా కాల్చడం వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. పాత శ్రీకాకుళం అంతా విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేస్తున్నామన్నారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న సభ్యులు

‘ఓపెన్ డే’ విజయవంతం

- శ్రీకాకుళం మహిళా డిగ్రీ కళాశాలను సందర్శించిన జూనియర్ కాలేజీల విద్యార్థులు
- సౌకర్యాలు, వసతులను వివరించిన ప్రిన్సిపాల్, సిబ్బంది



ల్యాబ్‌ను పరిశీలిస్తున్న వివిధ కళాశాలల విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ(అటానమస్) కళాశాలలో గురువారం నిర్వహించిన ఓపెన్ డే కార్యక్రమం విజయవంతమైంది. పలు కళాశాలలకు చెందిన ఇంటర్మీడియెట్ విద్యార్థులు మహిళా డిగ్రీ కళాశాలను సందర్శించారు. 2023–24 విద్యా సంవత్సరంలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరేందుకుగాను ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అందుబాటులో ఉన్న వసతులు, సౌకర్యాలు, సైన్స్ ల్యాబ్‌లు, లాంగ్వేజ్ ల్యాబ్‌లు, లైబ్రరీలు, తరగతి గదులను పరిచయం చేస్తునే.. వాటిపై అవగాహన కల్పించారు. శ్రీకాకుళం మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం ప్రిన్సిపాల్ డాక్టర్ కణితి శ్రీరాములు, సిబ్బంది కళాశాల గురించి పూర్తిస్థాయిలో వివరించారు.

ఫలితాలు.. ప్రగతి..

50 ఏళ్ల క్రితం స్థాపించిన ఈ కళాశాలలో అభ్యసించిన ఎంతోమంది విద్యార్థినులు నేడు అనేక రంగాల్లో ఉన్నతస్థాయిలో రాణిస్తున్నట్టు ప్రిన్సిపాల్ గుర్తు చేశారు. అందుబాటులో ఉన్న కోర్సులు, నిష్ణాతులైన అధ్యాపకులు, కళాశాలలో ఉన్న వసతులు, సౌకర్యాలు, ల్యాబ్‌లు, బయోమెట్రిక్ హాజరును వివరించారు. రీసెర్చ్ సెంటర్, జేకేసీ సెంటర్, జాతీయ సేవా పథకం, వివిధ క్లబ్‌లు, నిర్వహణ కమిటీలు, స్టూడెంట్స్ సెల్, యువ టూరిజం క్లబ్ ప్రత్యేకతలను తెలియజేశారు. వాస్తవానికి ఈ నెల 17న ఓపెన్ డే నిర్వహించాల్సి ఉన్నా కళాశాలలో శుక్రవారం డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో గురువారమే ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.శంకర్‌నారాయణ, కె.జ్యోతిలక్ష్మి, కె.సుజాత, ఆర్.సుజాత, సుగుణకుమారి, ఆర్.తవుడు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



కళాశాలలో సౌకర్యాలను వివరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీరాములు

పీడీఎస్ బియ్యం నిల్వ చేసిన డీలరుపై కేసు నమోదు

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాకివీధిలో 1350 కిలోల పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసిన డీలరు అంధవరపు లక్ష్మణరావుపై కేసు నమోదైంది. శ్రీకాకుళం విజిలెన్సు, రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ప్రవల్లిక చెప్పారు. ఈ నెల ఏడో తేదీన కాకివీధికి చెందిన డీలరు లక్ష్మణరావు ఇంటి ముందు రేకుల షెడ్డులో ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ద్వారా ప్రజలకు సరఫరా చేసే పీడీఎస్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినట్లు పి.భీమరాజు, జె.వెంకటేష్‌లు సచివాలయం వీఆర్వో సీహెచ్ వాణీలత ద్వారా పౌరసరఫరాల సీఎస్‌డీటీ జాఫర్ షరీఫ్, విజిలెన్సు ఎస్ఐ అశోకచక్రవర్తిలకు సమాచారం ఇచ్చారన్నారు. దీంతో అదే రోజు దాడులు నిర్వహించి అక్రమ నిల్వలు ఉన్నట్లు గుర్తించారన్నారు. దీనిపై డీలరు లక్ష్మణరావు తాను పాత న్యూస్ పేపర్ల వ్యాపారం చేస్తుంటానని, ప్రజల వద్ద నుంచి కిలో రూ. 15కు బియ్యం కొని బయట టిఫిన్ సెంటర్లు, పిండి మిల్లులకు 18 రూపాయల చొప్పున విక్రయిస్తుంటానని చెప్పడంతో వెంటనే ఆ బియ్యాన్ని అధికారులు సీజ్ చేశారన్నారు. ప్రభుత్వ నిర్దేశిత రేటు ప్రకారం కిలో రూ. 38 ఉండగా మొత్తం 1350 కిలోలకు గాను రూ. 51,300 ఉంటుందని అధికారులు తెలిపారన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని రెవెన్యూ శాఖకు అప్పగించామన్నారు.

అణు విద్యుత్ మట్టి పరీక్షలకు సహకరించండి

రణస్థలం: అణువిద్యుత్ కేంద్రం ఏర్పాటులో భాగంగా చేపట్టే మట్టి పరీక్షలకు ఆటంకం కలిగించవద్దని, నిర్వాసితుల సమస్యలు తప్పక పరిష్కరిస్తామని న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఇండియా కొవ్వాడ అడిషనల్ చీఫ్ ఇంజనీర్ పి.బంగారయ్యశెట్టి, తహసీల్దార్ సనపల కిరణ్‌కుమార్ కోరారు. రణస్థలం మండలం కొవ్వాడ అణు విద్యుత్ సమస్యలపై కొవ్వాడలో గురువారం గ్రామపెద్దల సమక్షంలో సమావేశం నిర్వహించారు. ముందుగా గ్రామస్తులు మాట్లాడుతూ రహదారి పాడైందని, పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని, భూ పరిహారం, పునరావాస కాలనీ తదితర సమస్యలు ఉన్నాయని, వీటిని త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ 22 మంది వారసులకు అణు నష్టపరిహారం అందించామని చెప్పారు. రోడ్డు, పారిశుద్ధ్య పనులు త్వరలోనే చేపడతామని తెలిపారు. పునరావాస కాలనీ పనులకు మరో నెల రోజుల్లో క్లియరెన్స్ వస్తుందన్నారు. మట్టి పరీక్షలకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జె.ఆర్.పురం ఎస్సై జి.రాజేష్, అణు విద్యుత్ అధికారి రవికుమార్, కొవ్వాడ గ్రామపెద్దలు మైలపల్లి పోలీసు, మైలపల్లి పట్టయ్య, అల్లిపల్లి రాముడు తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్ కిరణ్‌కుమార్

వేడుకగా ఆలయ ప్రతిష్ట

లావేరు: కేశవరాయునిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన దుర్గాభవానీ ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం గురువారం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా గోపూజ, పూర్ణాహుతి హోమం, యజ్ఞ భస్మ దారణ, అవభృతం పూజలు నిర్వహించారు. గ్రామ పురోహితులు మురపాక శంకరశాస్త్రి పర్యవేక్షణలో వీరఘట్టం పట్టణానికి చెందిన యజ్ఞయకర్త ఎస్‌వీఎల్ఎస్ శర్మయాజీ ఆధ్వర్యంలో ఆలయ ప్రతిష్ఠ, పూజలు జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ నాయని శ్రీనివాసరెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టరు లుకలాపు అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ అలుపున రమణమ్మ, సర్పంచ్ యాగాటి వెంకటలక్ష్మి, మాజీ సర్పంచ్‌లు నాయని వెంకటేష్, శివాంగం నాగరాజు, గొర్లె రామినాయుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అలుపున నారాయణరెడ్డి, యాగాటి ఆదినారాయణ, నాయని మోహనరెడ్డి పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న భక్తులు

ఆలయాల్లో పూజలు

జి.సిగడాం: వెంకయ్యపేట గ్రామంలోని భాగ్యలక్ష్మి పేరంటాల అలయ ప్రతిష్ఠా మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. మూడు రోజులు ఉత్సవాలు జరగనున్నాయి. ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, స్థానిక సర్పంచ్ మావిడి శ్రీనివాసరావు పేరంటాలకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు కాయల పోలీస్, ఆనంద్, రామారావు, శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

బాబాకు పూజలు


జి.సిగడాం: ఆనందపురం గ్రామంలోని వంద అడుగుల వెంకటి సాయికోటి మహస్థూపం వద్ద గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. 10 గంటలకు బాబాకు అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

ఎస్.ఎస్.ఆర్.పురంలో..

ఎచ్చెర్ల: ఎస్.ఎస్.ఆర్‌పురం గ్రామంలోని బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. బాబా విగ్రహాన్ని అలంకరించి తీరువీధి నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకున్నారు.



జి.సిగడాం: భాగ్యలక్ష్మి పేరంటాలకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



ఎచ్చెర్ల: బాబాను దర్శించుకుంటున్న భక్తులు

విద్యార్థిని అదృశ్యంపై ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైమ్: విశాఖ–బీ కాలనీకి చెందిన పదో తరగతి విద్యార్థిని గురువారం అదృశ్యమైనట్టు ఫిర్యాదు అందిందని శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్సై బలివాడ గణేష్ తెలిపారు. అదృశ్యమైన బాలిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల పక్కనే ఉన్న బాలికల హైస్కూల్‌లో చదువుతున్నట్టు చెప్పారు. గురువారం ఉదయం స్కూల్‌కు వెళ్లిన విద్యార్థిని ప్రార్థన ముగియగానే బయటకు వెళ్లి తిరిగి రాలేదని ప్రధానోపాధ్యాయుడు ఫోన్లో సమాచారం అందించడంతో కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ తెలియరాలేదన్నారు. దీంతో పోలీసులను ఆశ్రయించినట్టు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జూనియర్ సివిల్ జడ్జిగా రోహిణీరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా పాలకొండకు చెందిన ఎం.రోహిణీరావు జూనియర్ సివిల్ జడ్జిగా నియమితులయ్యారు. ఈమెకు విజయనగరం జిల్లా కురుపాం కోర్టులో జూనియర్ సివిల్ జడ్జిగా పోస్టింగ్ ఇచ్చారు. రోహిణీరావు ఇటీవల నిర్వహించిన న్యాయమూర్తుల పరీక్షల్లో ఎంపికయ్యారు.

25న మండల సర్వసభ్య సమావేశం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 25న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కుమార్ పట్నాయక్ గురువారం తెలిపారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ మొదలవలస చిరంజీవి అధ్యక్షతన జరగనున్న సమావేశానికి ప్రజాప్రతినిధులు, మండల అధికారులు హాజరు కావాలన్నారు.

వాలీబాల్ టోర్నీ విజేత పూడివలస



ప్రథమ బహుమతి అందుకుంటున్న పూడివలస జట్టు

ఎచ్చెర్ల క్యాంపస్: పూడివలస గ్రామంలో సీతారామ కల్యాణ మహోత్సవాల్లో భాగంగా జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు మూడు రోజులుగా నిర్వహించారు. 32 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. గురువారం సాయంత్రం విజేతలకు బహుమతుల ప్రదానం జరిగింది. ప్రథమస్థానంలో నిలిచిన పూడివలస జట్టుకు రూ. 10 వేలు, షీల్డ్ అందజేశారు. రెండో స్థానంలో నిలిచిన నిమ్మాడ జట్టుకు రూ. 7 వేలు, మూడో స్థానంలో నిలిచిన జెమ్స్ ఆస్పత్రి జట్టుకు ఐదు వేల రూపాయలను పోలీస్ కానిస్టేబుల్ చిగిలిపల్లి అప్పలరాజు, ఎంపీటీసీ సభ్యుడు సూర వెంకటరమణ, కోరాడ అప్పారావు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జరుగుళ్ల కృష్ణారావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సనపల నారాయణరావు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుపై అవగాహన ర్యాలీ

గార: నవధాన్యాల సాగుతో భూమి సారవంతమవుతోందని ఏపీసీఎన్ఎఫ్ పీఆర్‌పీ బొడ్డేపల్లి సీతారామయ్య అన్నారు. రామచంద్రాపురం పంచాయతీ అంబటివానిపేట గ్రామైఖ్య సంఘం పరిధిలో నవధాన్యాల సాగుపై రైతులచే అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం చాలా లాభదాయకమన్నారు. రైతులు దృష్టి పెడితే అద్భుతాలు సాధించవచ్చునని చెప్పారు. నవధాన్యాల సాగుతో చేకూరే లాభాలను ర్యాలీలో నినాదాల ద్వారా తెలియజేశారు. ఉత్తమ రైతు చల్లా వెంకటేశ్వర్లు, ఎన్‌పీఎం దుకాణదారు అంబటి సుధీర్, ఎంసీఆర్ జె.గున్నమ్మ, లావేటి ప్రమీల, ఆర్‌బీకే వీఏఏ ప్రియాంక, ఐసీఆర్‌పీ కల్యాణి పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

25 నుంచి ఐఎఫ్‌టీయూ రాష్ట్ర మహాసభలు

శ్రీకాకుళం: భారతీయ కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) 9వ రాష్ట్ర మహాసభలు ఈ నెల 25, 26 తేదీల్లో శ్రీకాకుళం నగరంలో నిర్వహించనున్నట్లు ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.సింహాచలం తెలిపారు. గురువారం రిమ్స్ ఆస్పత్రి ఆవరణలో రిమ్స్ కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 9వ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కులు కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లు తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 25న శ్రీకాకుళం మున్సిపాల్ గ్రౌండ్ నుంచి భారీ ప్రదర్శన ర్యాలీ ఉంటుందన్నారు. కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎ.శ్యామల, సీహెచ్ లక్ష్మణరావు, డి.జయప్రద, డి.గోవిందమ్మ, కె.విజయ, టి.ప్రభ, డి.దుర్గా, పద్మ, అనిత తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రిమ్స్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు

విస్తృతంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



మహంతిపాలెంలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

రణస్థలం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలకు సంబంధించి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అధిక మెజారిటీతో గెలిపించాలని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ కోరారు. మహంతిపాలెం, కృష్ణాపురం, రణస్థలం పంచాయతీల్లో ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల ప్రచార పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే నెల 13వ తేదీన జరగబోయే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలపర్చిన సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యతగా అమూలమైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం ప్రచార గోడపత్రికలను పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు చిల్ల వెంకటరెడ్డి, మైలపల్లి కామరాజు, మహంతి చినరామినాయుడు, పిన్నింటి లక్ష్మునాయుడు, మహంతి జోగినాయుడు, మహంతి గురునాయుడు, మింది శ్రీనివాసరెడ్డి ఉన్నారు.